క్లుప్తంగా

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

దుద్యాల్: రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూమి కల్గిన ప్రతీ రైతు గ్రామాల్లోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) దగ్గర నమోదు చేసుకోవాలన్నారు. కేంద్రం ప్రభుత్వం రైతుల కోసం తీసుకువచ్చిన కొత్త పథకం ఫార్మర్ రిజిస్ట్రేషన్ అని అన్నారు. కేంద్రం అందించే పథకాలు రైతులకు చేరాలంటే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు మాదిరిగా రైతుకు యూనిక్ కోడ్ అందజేయనున్నారన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు భూమి పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని గ్రామాల్లో ఉండే ఏఈవోలను సంప్రదించాలని తెలిపారు.

డీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ లాల్‌కృష్ణ

పరిగి: డీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని డీసీసీ ఉపాధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ త్వరలో నియమించనున్న నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. వికారాబాద్ ఉమ్మడి, జిల్లాతో పాటు, వికారాబాద్ జిల్లా ఏర్పాటయిన తరువాత కూడా డీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు దక్కలేదని పేర్కొన్నారు. అటు రాజకీయంగా, ఆర్థికంగా బీసీలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. కాంగ్రెస్‌ను రాష్ట్రంలో అధికారంలోకి తెచ్చేందుకు బీసీలు కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో ఏళ్ల నుంచి పార్టీ కోసం బీసీలు ఎంతో మంది కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. అధికారం ఉన్నా, లేకున్నా పార్టీకి అండగా నిలిచారని వారు పేర్కొన్నారు.

రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు నూతన వ్యవసాయ సాంకేతికతను అందించాలనే లక్ష్యంతో ఈ నెల 5 నుంచి 13 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు షాబాద్ వ్యవసాయ అధికారి వెంకటేశం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఈ నెల 8వ తేదీన లక్ష్మారావుగూడ, సోలిపేట్, 16న తిమ్మారెడ్డిగూడ, మద్దూరు, 23న ఏట్ల ఎర్రవల్లి, హైతాబాద్, 30న మక్తగూడ, పెద్దవేడు, జూన్ 6న రేగడిదోస్వాడ, చందనవెల్లి, 13న తిర్మలాపూర్, రుద్రారం గ్రామాల్లో అన్నదాతలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని శాస్త్రవేతలు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

షాబాద్: ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ సర్పంచ్ బోకుల లింగం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో గల హనుమాన్ దేవాలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని దేవుడికి కేటాయించాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ మక్తలో ఉర్సు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం ఈ ఉత్సవాల్లో మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందూ ముస్లింలు ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, సుమిత్రాచందునాయక్, వీరేశంగుప్తా, ముబిన్‌ఘోరి, రవిగౌడ్, శ్రీను, బాల్‌రాజ్, జహంగీర్, ఖాజా, అలీం పాషా, సత్తార్‌పాష తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్: షాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989–1990 పదో తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులోని కో కో ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 36 ఏళ్ల తర్వాత అందరూ ఒక్కచోట కలిసి ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్నానాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు చేరిన ఉపాధ్యాయులు వీరస్వామిగౌడ్, యాదగిరాచారి, నర్సింహారావు, అడివప్ప, పురుషోత్తంను వేదికపైకి పిలిచి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నర్సింలు, శ్రీశైలం, జగదీశ్వర్‌రెడ్డి, మల్లయ్య, మదన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు మంజూరయ్యేనా..?

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం

- కాంగ్రెస్ నాయకుల చేతికి జాబితా
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు
- గ్రామాల్లో నాయకుల నిర్ణయమే ఫైనల్ !



దుద్యాల్: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మొదట గుర్తుకొచ్చేది ఇందిరమ్మ ఇళ్లు. ప్రతీ పేదోడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంలో కాంగ్రెస్ మొదటి స్థానంలో ఉంటుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇదంతా గతం. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రస్తుతం ఏ పథకం అమలు చేయాలన్నా అనేక రకాల నిబంధనలు పెడుతున్నారు. దీంతో ప్రజలు పార్టీపై కోపంతో ఉన్నారు. ప్రతీ పల్లె నుంచి మహానగరం వరకు ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఇటీవలే ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేసిన పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల వివరాలు, వారి ప్రస్తుత ఇంటి పరిస్థితిని ఆన్‌లైన్లో నమోదు చేసింది. పూర్తి వివరాలు ప్రభుత్వానికి అందించింది. అయితే ఇందిరమ్మ ఇళ్లకు అసలు లబ్ధిదారులు ఎవరనేది ఎంపిక చేయడంలో అధికారులకు బాధ్యతలు అప్పగించాలి. ఎందుకంటే అంత ఆన్‌లైన్ కాబట్టి ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు గ్రామాల్లో ఉండే కాంగ్రెస్ బడా లీడర్లకు అప్పగించారనే వార్తలు హల్చల్ చేస్తున్నాయి. గ్రామాల్లో ఉండే బడా నాయకులు అసలు నిరుపేద, ఇల్లు లేని వారిని గుర్తించి వారికి కేటాయిస్తారా? లేకా కాంగ్రెస్ కార్యకర్తలకే కేటాయిస్తారా? అనే అనుమానం గ్రామాల్లో పెరిగిపోయింది. ఎవ్వరిని అడిగినా గ్రామాల్లో ఇదే చర్చ కొనసాగుతోంది. మండలంలోని ప్రతి గ్రామంలో ఎవరినీ కదిలించిన ఇదే మాట. మాకు మంజూరవుతుందా? లేదా? అనే అనుమానంతో పేదలు, అసలు లబ్ధిదారులు ఆశతో ఎదురుచూస్తున్నారు. దుద్యాల్ మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా 200 ఇళ్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో దుద్యాల్ మండల కేంద్రానికి 40 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించినట్లు విశ్వసనీయ సమాచారం. మిగితా గ్రామ పంచాయతీలకు ఎన్నెన్ని కేటాయిస్తారనేది త్వరలో తేలనుంది.

రేకుల గదిలో జీవిస్తున్న..



నా పేరు తొందూరి అనసూయ. ముగ్గురు సంతానం. భర్త చనిపోవడంతో కూలీ పనులు చేస్తూ కొన్నేళ్లుగా రేకుల గదిని ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నా. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాను. పలు మార్లు అధికారులను అడిగినా లబ్ధిదారుల ఎంపిక కాలేదని చెబుతున్నారు. పిల్లలు ఇంటికి వస్తే ఇరుకు గదిలో ఉండలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు అర్హులను గుర్తించి మంజూరు చేయాలి.

– తొందూరి అనసూయ, దుద్యాల్



ప్రచారం నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, చిన్నారులు

పర్యావరణ పరిరక్షణకు ప్రచారం

ఇంటింటికీ తిరుగుతూ అవగాహన

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) మంగళవారం ఆదర్శతులసీ నగర్ కాలనీలోని వినాయక శాఖకు చెందిన స్వయం సేవకులు ప్రజలకు అవగాహన కల్పించారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం, నీటి సంరక్షణ, ఇంధనాలను తక్కువగా వినియోగించడం వంటి కార్యక్రమాలపై ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణ మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డిని కలిసి పట్టణంలోని వార్డుల్లో చెత్తా, చెదారాన్ని తొలగించడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా ఉత్తర్వులు జారీ చేయడం వంటి వాటిపై వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ కడియాల సంగమేశ్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వినాయక శాఖ కార్యవాహ కృష్ణయ్య, కొత్త శ్రీనివాస్, ఆనందం, హన్మప్ప, కృష్ణకుమార్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికే పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న కాంగ్రెస్ యువ నాయకులు

తాండూరు రూరల్: ఇంటికే పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. వేసవికాలం దృష్ట్యా అంగన్‌వాడీ సెంటర్లకు సెలవులు ప్రకటించింది. దీంతో గర్భిణీ, బాలింత, చిన్నారులకు మే నెలకు సరిపడ పౌష్టికాహారాన్ని ఇంటికి పంపిచే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం–3లోని బాలింత, గర్భిణులకు కాంగ్రెస్ యువ నాయకులు భరత్ కిషోర్, శ్రీనివాస్‌గౌడ్ బియ్యం, పప్పు, నూనె, గుడ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో ఇంటికే పౌష్టికాహారం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వేసవిలో పౌష్టికాహారానికి దూరం కావొద్దనే ఉద్దేశ్యంతోనే పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, గర్భిణులు, బాలింత, చిన్నారులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

కొడంగల్ రూరల్: వికారాబాద్ జిల్లాలోని ఎన్నేపల్లి చౌరస్తాలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని నియోజకవర్గ అంబేడ్కర్ సంఘం నాయకులు చెవిటి శ్రీనివాస్ కోరారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనంతగిరి: అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆయా గ్రామ, మండల, జిల్లా స్థాయి నాయకులు విద్యార్థి, మహిళ, కార్మిక, ఉద్యోగ, అనుబంధ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

మర్పల్లి: మండల కేంద్రంలోని మార్కెట్ షెడ్‌లో బుధవారం నుంచి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు మర్పల్లి ఏఓ శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక ఎకరానికి 14 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. క్వింటాల్ జొన్నలకు రూ. 3,371 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు వచ్చే వారు తమ పంట వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్లో నమోదు చేసుకొని ఉండాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జొన్న పంట రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రయివేటీకరణను ఆపాలి

అనంతగిరి: దేశంలోని రైల్వే వ్యవస్థలో జరుగుతున్న ప్రయివేటీకరణను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శిమైపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వికారాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో భద్రతచర్యలను చేపట్టాలని, రైల్వే ప్రమాదాలను అరికట్టాలన్నారు. రైల్వేలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. యాదయ్య, దశరథ్, నర్సింలు, శ్రీనివాస్, మల్లేష్, యాదయ్య, జంగయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

చేవెళ్ల: మున్సిపల్ పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో గత రెండు రోజులుగా మల్లన్న, బీరప్ప ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉత్సవాల్లో పాల్గొని ఆలయంలో పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాణిక్యరెడ్డి, రాములు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కొడంగల్ రూరల్: రుద్రారం గ్రామంలో పోషగాళ్ల దేవమ్మ పట్టా పొలంలో అక్రమంగా ఇళ్లు కట్టుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కుల నిర్మూలన పోరాట సమితి (కెఎన్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూరం అభినవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల చంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు స్పందించి పోషగాళ్ల దేవమ్మకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెఎన్‌పీఎస్ కొడంగల్, బొంరాస్‌పేట మండలాల అధ్యక్షులు ఇందనూర్ అంజి, అంజిలప్ప, నాయకులు రావులపల్లి మహేష్, అంజి, బలరాం, వెంకటయ్య, ఆనంద్, పకీరప్ప, రుద్రారం పద్మ, కస్తూర్‌పల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ విజయకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న కెఎన్‌పీఎస్ నాయకులు

ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పెన్నిధి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్



ఎల్‌ఓసీ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పెన్నిధి అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పట్లూర్ గ్రామానికి చెందిన గడ్డం విశ్వనాథం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న సురేశ్ పార్టీ సీనియర్ నాయకుడు రాములు యాదవ్ సహకారంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. విశ్వనాథానికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.2,50,000లకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్లూర్ మాజీ ఎంపీటీసీ మహేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా, కార్మిక సంఘాల నాయకులు

సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ పోస్టర్ ఆవిష్కరణ

తాండూరు టౌన్: దేశ వ్యాప్తంగా మే 20వ తేదీన చేపట్టనున్న కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తాండూరులో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులను కట్టుబానిసత్వంలోకి నెట్టేందుకు నాలుగు కార్మిక చట్టాలను అమల్లోకి తేవాలని యత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న కనీస వేతన చట్టం, ఉద్యోగ భద్రత, 8 గంటల పని విధానం, సంఘాలు స్థాపించుకునే హక్కు, సమ్మె హక్కు వంటి కార్మిక హక్కులను కేంద్రం కాలరాయాలని చూస్తోందన్నారు. కార్మికుల పొట్ట కొట్టి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు కొత్త కార్మిక చట్టాలను తెస్తోందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా 11 జాతీయ కార్మిక సంఘాలు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఈ సమ్మెలో కార్మికులంతా పాల్గొని కొత్త కార్మిక చట్టాలను కేంద్రం వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

రేబిస్ వ్యాధిపై అప్రమత్తత అవసరం

దోమ: రేబిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రజిత పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, స్థానికులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వీధి కుక్కలు, పెంపుడు కుక్కలను పెంచేవారు వాటి ప్రవర్తన, వాటికి వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనారోగ్యానికి గురయ్యే కుక్కల నోటి నుంచి నిరంతరం లాలాజలం స్రవించడం, జనాలను తరచూ కరవడం వంటివి చేస్తుండడాన్ని గమనించాలని పేర్కొన్నారు. కుక్కలు కరిచిన సందర్భంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి రజిత

లబ్ధిదారుల ఎంపిక త్వరగా పూర్తిచేయాలి

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి బ్యాంకుల అధికారులకు కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఆయా బ్యాంకుల అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ జిల్లా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 1,673 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికపై బ్యాంక్ అధికారులకు నియమ నిబంధనలను వివరించి, మండలంలో వచ్చిన దరఖాస్తులను వారికి అందించారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, ప్రకాశ్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకుల వారీగా దరఖాస్తుల పరిశీలన

కొందుర్గు: రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇటీవల ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులను ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకర్లు పరిశీలించారు. బ్యాంకుల వారీగా దరఖాస్తులను విభజించి, జాబితాను బ్యాంకర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ఉంటుందని, దరఖాస్తుదారుల పూర్తిడేటా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో మండల స్థాయి అన్ని బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రిటైర్డ్ జీహెచ్‌ఎంలకు సన్మానం

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీకాకతీయ టాలెంట్ స్కూల్ ఆవరణలో మంగళవారం డివిజన్ గణిత ఫోరం ఆధ్వర్యంలో రిటైర్డ్ జీహెచ్‌ఎంలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గణిత ఫోరంలో చురుకుగా పని చేసిన జీహెచ్‌ఎంలు దొంతు పాండురంగయ్య, వెంకటయ్య పదవీ విరమణ పొందిన సందర్భంగా వారికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఫోరం డివిజన్ అధ్యక్షుడు నర్సింలు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థులను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేన్నారు. అనంతరం రిటైర్డ్ జీహెచ్‌ఎంలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గణిత ఫోరం నాయకులు గణేశ్‌కుమార్, బాబుచంద్, మల్లేశ్వర్, రమామహేశ్వర్, రాంచంద్రారెడ్డి, శ్రీరాములు, శైలజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ జీహెచ్‌ఎంలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి



వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి

షాబాద్: వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేయడం అభినందనీయమని, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ నిరంతరం కృషి చేస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి గ్రామంలో రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న ఈసీ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తోందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ వంతెన నిర్మాణంతో చుట్టూ పక్కన గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. పార్టీ కార్యకర్తలందరూ ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసి పనిచేస్తేనే విజయ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకొని దశలవారీగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరాంరెడ్డి, నర్సింలుగౌడ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మద్దూరు కిష్టయ్య, శ్రీనివాస్, నర్సింలు, ప్రవీణ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

వెంటనే బహిష్కరించాలి

అనంతగిరి: దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయులను వెంటనే బహిష్కరించాలని వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాక్ మద్దతుతో ఆశ్రయం పొందిన ఉగ్రవాదులు పహల్గాంలో 26మంది భారతీయులను క్రూరంగా బలిగొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ దారుణ ఘటన యావత్ దేశాన్ని కలిచివేసిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న తీవ్రమైన నిర్ణయాల్లో భాగంగా దేశంలోని పాకిస్తానీలను దేశం వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ పలు ప్రాంతాల్లో అక్రమంగా ఉన్న పాకిస్తాన్ జాతీయులను వెంటనే పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సదానందారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్లనందు, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ అమరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, సుధాకర్ ఆచారి, రాములు, నరసింహారెడ్డి, రాఘవేందర్, శ్రీకాంత్‌రెడ్డి, విక్రం, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వలసదారులను పంపించండి

దోమ: చట్టవిరుద్ధంగా పాకిస్తాన్ దేశస్థులు భారతదేశంలో ఉన్నట్లయితే వారిని దేశం నుంచి పంపించాలని దోమ బీజేపీ మండల అధ్యక్షుడు బొంగు మల్లేశం అన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ కారణాలతో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన మత ఛాందసవాదులు భారతదేశంలో ఉంటూ అల్లర్లకు పాల్పడుతున్న వారిని వెంటనే తరిమేయాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా దేశంలో ఉంటున్న వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యాట అశోక్‌కుమార్, దోమ నర్సింలు, బోయిని బాబు, శివకుమార్, సంతోశ్ నాయక్, హరీశ్, వెంకటయ్య, సత్యం, దోమ గణేష్, తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



దోమ: తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు